క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికి కృషి


జేవీ సుబ్బారావు

ద్వారకాతిరుమల: మండలంలో భూ సమస్యల పరిష్కారానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన తహసీల్దార్ జేవీ సుబ్బారావు అన్నారు. ద్వారకాతిరుమల తహసీల్దార్‌గా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ బి.దుర్గా మహాలక్ష్మి, పలువురు వీఆర్వోలు పూల బొకేను అందించి, స్వాగతం పలికారు.

మీకోసం అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత


తహసీల్దార్ చెల్లన్నదొరకు అభినందనలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

కొయ్యలగూడెం: మీకోసం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, అర్జీదారులు నేరుగా దరఖాస్తు చేసుకుని సేవలు పొందాలని తహసీల్దార్ కె.చెల్లన్నదొర పేర్కొన్నారు. బదిలీపై వచ్చిన ఆయన బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ శాఖను ప్రజలకు మరింత చేరువగా అయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. రెవెన్యూ అసోసియేషన్ నాయకులు తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్, ఆర్ఐ మణి దివ్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

చింతలపూడి తహసీల్దార్‌గా ప్రమద్వర


డీఎల్ ప్రమద్వర

చింతలపూడి: చింతలపూడి తహసీల్దార్‌గా డీఎల్ ప్రమద్వర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన గోపాలకృష్ణ రాజమండ్రి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రమద్వర మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని చెప్పారు. మండలంలో రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి నేరుగా తీసుకురావాలని కోరారు.

పీహెచ్‌సీ తనిఖీ


పీహెచ్‌సీ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

లింగపాలెం: లింగపాలెం పీహెచ్‌సీని బుధవారం చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులు పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, దీనికి సిబ్బంది నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్నారు. కాగా, ఆసుపత్రికి సకాలంలో వైద్యులు రాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కాలం చెల్లిన మందులు, పరికరాలను పరిశీలించి అసహనం వ్యక్తంచేశారు.

విశ్వకవికి ఘన నివాళి


ఠాగూర్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 83వ వర్ధంతి కార్యక్రమం కుంతలగూడెం ఎంపీపీ స్కూల్లో బుధవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఠాగూర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నోబెల్ పురస్కారంతో విశ్వకవి రవీంద్రుడు ప్రపంచ ఖ్యాతి ఆర్జించి అవిభాజ్య భారతావనికి గర్వకారణంగా నిలిచారని అన్నారు. రవీంద్రనాథ్ గేయాలను విద్యార్థులు ఆలపించి శ్రద్ధాంజలి ఘటించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లాయిగూడేనికి చెందిన పుట్టా నాగరాజు (55) కారు డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తరచు మద్యం సేవిస్తూ ఉండడంతో ఇంట్లో భార్యతో గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ నేపథ్యంలో ఈనెల 5న ఇంట్లో గొడవ జరగటంతో తీవ్ర మనస్థాపానికి చెందిన నాగరాజు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడ్ని నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఈనెల 6న గుంటూరులోని జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

అంధకారంలో పూచికగొంది

- కొండవాగుల ఉధృతికి, వర్షాలకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- గత 20 రోజులుగా గ్రామంలో అలుముకున్న చీకట్లు
- విష పురుగులు సంచరిస్తున్నాయని గిరిజనుల ఆవేదన
- విద్యుత్ సదుపాయం పునరుద్ధరించాలని వేడుకున్నా పట్టించుకోని అధికారులు



పూచికగొంది గ్రామానికి ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన పూచికగొంది గ్రామం అంధకారంలో మగ్గుతోంది. గత నెల 18వ తేదీన కురిసిన భారీ వర్షాలకు కొండవాగులు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామంలోని విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. దీనితో ఆ గ్రామానికి పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే తమ గ్రామానికి మళ్లీ విద్యుత్ సదుపాయం కల్పించాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. పూచికగొంది గ్రామానికి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంట్ సదుపాయం కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ తెలిపారు. అయితే రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప గిరిజనులకు కరెంట్ కష్టాలు తీర్చడంలేదని ఆయన విమర్శించారు. అసలే అటవీప్రాంతం దీనికితోడు వర్షాలకు వాగు పొంగుతుండడంతో చీకట్లో విషపురుగులు సంచరించే అవకాశం ఉందని తమకు ఇప్పటికైనా విద్యుత్ సదుపాయం కల్పించాలని పూచికగొంది కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు.

పనిచేయని సోలార్ లైట్లు.. చీకటిలోనే మోదేలు, గుళ్లమడుగు

వేలేరుపాడు మండలం పరిధిలో ఉన్న మోదేలు గ్రామంలో సుమారు 25 కుటుంబాల వరకూ గిరిజనులు నివసిస్తున్నారు. ఈ గ్రామానికి గత ప్రభుత్వంలో విద్యుత్ సదుపాయానికి రూ.70 లక్షల నిధులు మంజూరు చేశారు. బుట్టాయగూడెం మండలానికి దగ్గరగా ఈ గ్రామం ఉండడంతో డోలుగండి గ్రామం నుంచి మోదేలుకు విద్యుత్ సదుపాయం కల్పించే విధంగా విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే ఫారెస్ట్ అధికారుల అభ్యంతరాలతో విద్యుత్ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ గ్రామంలో ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ లైట్‌లు కూడా పనిచేయకపోవడంతో ఆ గ్రామం కూడా అంధకారంలో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా గుళ్లమడుగు అనే గ్రామం కూడా సోలార్ లైట్‌లు పనిచేయకపోవడంతో అంధకారంలో ఉన్నట్లు గ్రామస్థులు చెప్పారు. మోదేలు, గుళ్లమడుగు గ్రామాలకు రోడ్లు, పాఠశాల, కరెంట్, అలాగే ఏఎన్ఎమ్ ఏర్పాటుతో పాటు అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మించేలా కృషి చేయాలని కోరుతూ ఇటీవల రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు లేఖ రాసినట్లు కారం రాఘవ చెప్పారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీ

టి.నరసాపురం: అనుమతులు లేకుండా ఔషధాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం, తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు జి.జీవన, మల్లికార్జునరావు అన్నారు. టి.నరసాపురంలో బుధవారం మెడికల్ షాపులను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారులకు వచ్చిన ఫిర్యాదుల మేరకు మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా బుధవారం టి.నరసాపురంలోని 6 మెడికల్ షాపులను తనిఖీ చేశామని, బిల్లుల్లో చిన్న చిన్న తేడాలు తప్ప మరే తేడాలు లేవని తెలిపారు. కాగా, టి.నరసాపురం మండలంలో లైసెన్సులు కలిగిన 60 మెడికల్ షాపులు ఉన్నట్లు వారు తెలిపారు.

డయేరియా నివారణకు శుభ్రతే కీలకం

కామవరపుకోట: అతిసార వ్యాధి నిర్మూలనకు మంచినీరు, పరిశుభ్రతే కీలకమని జేజేఎం కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డయేరియా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చి నీటిని తాగాలని, భోజనం చేసేముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగులూరి సర్వేశ్వరరావు, ఐఈసీఎస్.భూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్డు హైస్కూల్ వద్ద వేంచేసి ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయ సన్నిధిలో బుధవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుమారు 1600 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

టి.నరసాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో టి.రామ్మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 60పాఠశాలల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు జరుగుతాయని, ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున సభ్యులు ఎన్నుకోబడతారన్నారు. వీరిలో ఒకరు చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్‌గా ఎన్నుకోనున్నట్లు చెప్పారు. ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు మహిళలు ఉండాలని, వీరిలో ఒకరు చైర్మన్ గాని, వైస్‌చైర్మన్‌గా గాని ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. కావున ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలలకు వచ్చి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు.

పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- జంగారెడ్డిగూడెంలో కౌన్సిల్ సమావేశం


సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

జంగారెడ్డిగూడెం: పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేసి ముందుకు సాగాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పట్టణంలోని సమస్యలను వివరించారు. ప్రధానంగా కౌన్సిలర్‌లు ఇందిరా ప్రియదర్శిని, నంబూరి రామచంద్రరాజు తదితరులు అధిక వర్షాల నేపథ్యంలో జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని, పట్టణంలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. భారీ వర్షాలకు రోడ్లు, కల్వర్టులు, దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. వైస్‌ఛైర్మన్ ముప్పిడి అంజి మాట్లాడుతూ కాంట్రాక్టర్‌లు పనులు చేపట్టడం లేదని, వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తయిన పనులకు అధికారులు బిల్లులు చేయకపోవడంతో పనులు పెండింగ్ పడుతున్నాయన్నారు. ఏవీ రమణమూర్తి మాట్లాడుతూ బాలాజీ నగర్‌లో రూ.1.40 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, అక్కడ స్థల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ వార్డుల్లో మోటార్‌సమస్య ఏర్పడిందని, వెంటనే ఏర్పాటుచేయాలని, అలాగే ఆయా రోడ్లకు కనెక్టివిటీ సరిగా లేదని, మేకల కబేళా జనావాసాల మధ్య ఉందని, దానిని తొలగించాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కె.రమాదేవి మాట్లాడుతూ పట్టణంలో సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి స్థలం ఏర్పాటుచేయాలని కోరారు. నేట్రు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ డాంగేనగర్ యూపీహెచ్‌సీ భవనం వెంటనే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కమీషనర్ ఎస్.నరేంద్రకుమార్, ఏఈ సంధ్య, మేనేజర్ రమణ, ఆర్ఐ సుబ్బారావు, ఏఈ సునీత, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అజెండాలో ఆమోదించిన పలు అంశాలివి

- ప్రధానంగా శ్మశానవాటిక నిర్వహణ, అభివృద్ధికి క్షత్రియ సేవాసమితి ముందుకు వచ్చిందని, దానిని క్షత్రియ సేవా సంఘం నిర్వహించేలా, అభివృద్ధి పనులు చేపట్టేలా కౌన్సిల్ తీర్మానించింది.
- 17వ వార్డులో నూతన బోరు ఏర్పాటుకు తీర్మానం.
- 12వ వార్డులో సీసీ డ్రెయిన్‌ల నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయిస్తూ తీర్మానం.
- 21వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 5లక్షలు కేటాయిస్తూ తీర్మానం.
- 15వ వార్డులో డ్రెయిన్ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారు.
- 21వ వార్డులో రూ. 3 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి తీర్మానం.
- 22వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ఆమోదం
- 16వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్‌న నిర్మాణానికి తీర్మానం
- పట్టణంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు అవసరమైన కిట్‌లు, షెడ్ ఏర్పాటు అంచనా వేసిన రూ.35 లక్షలకు బదులు ఇంకా తక్కువ ఖర్చు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

ఖాదీ వస్త్రాలను ప్రోత్సహించాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బీజేపీ పట్టణ కమిటీ, బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతన్నలకు బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణాధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు మాట్లాడుతూ చేనేత వస్త్రాలు భారతీయ సంప్రదాయం, కళలకు ప్రతిబింబాలు అని, స్వదేశీ వస్తువులు, మన ఖాదీ పరిశ్రమని ప్రోత్సహించాలన్నారు. అనంతరం బుట్టాయిగూడెం రోడ్డులో స్వదేశీ ఖాదీ వస్త్రాలయంను సందర్శించి ఖద్దరు వస్త్రాలను బీజేపీ నాయకులు కొనుగోలు చేశారు. పార్టీలకు అతీతంగా ప్రతి రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారస్తులు, ఖాదీ వస్త్రాల మీద ప్రీతి ఉన్నవారు ఖాదీ దుస్తులను స్థానికంగా కొనుగోలు చేసి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టీఐ కన్వీనర్ మాడా రామ్మోహన్‌రావు, ఓబీసీ మోజ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడేపల్లి నాగు, పోలవరం నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్, ఏలూరు జిల్లా లీగల్ సెల్ కోకన్వీనర్ సోలస రవి ధర్మరాజు, చింతలపూడి నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ మారిశెట్టి అంజన్ కుమార్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



జంగారెడ్డిగూడెంలో వాహన తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధారణపై కౌన్సిలింగ్ ఇస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: హెల్మెట్ ధారణ తప్పనిసరి అని సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించి, హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించడంతోపాటు, వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజేష్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మరోసారి హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు చెప్పారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించినట్లు తెలిపారు. సురక్షిత ప్రయాణాలకు నిబంధనలు పాటించడం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వేలేరుపాడు: ప్రపంచ ఆదివాసీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఏపీజీఎస్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య పిలుపునిచ్చారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం పిట్టా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం అనేక మంది గిరిజనులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. అలాంటి త్యాగధనుల ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వ ఖర్చులతో నిర్వహించాలని కోరారు. తొమ్మిదొవ తేదీన ప్రతి ఆదివాసీ బిడ్డ గ్రామాల్లో జెండాలు ఎగురవేయాలన్నారు.

ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి నీటి విడుదల


ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ రెండు గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్న నీరు

పోలవరం రూరల్: ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్‌లోకి భారీ స్థాయిలో నీరు చేరుతోంది. తుపాను ప్రభావంతో కొండ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌లో క్రమేపీ నీటిమట్టం పెరుగుతోంది. రిజర్వాయర్‌లో 89.60 మీటర్లకు నీటి మట్టం చేరుకుంది. ఎఫ్ఆర్ లెవల్ 90.50 మీటర్లు కావడంతో బుధవారం రెండు గేట్లు ఎత్తి 340 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇంకా రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ఏజెన్సీలో భారీ వర్షం

ఏజెన్సీ ప్రాంతంలో తుపాను ప్రభావంతో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షంతో సాగునీటి చెరువులన్నీ నిండుకుండల్లా మారాయి. కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండకాలువల నీరంతా పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్‌నుంచి గోదావరిలోకి చేరుతోంది. ఇసుక కాలువ నీరు, కడెమ్మ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి చేరుతోంది. ఇంకా వర్షాలు కురుస్తుండటంతో కొండవాగులు ఉధృతి ఇంకా తగ్గలేదు.

తిరుమలదేవిపేటలో పొలంబడి


తిరుమలదేవిపేటలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: తిరుమలదేవిపేట గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.సుమలత మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పంటలు పండించాలని, మిత్ర పురుగులను సంరక్షించాలని రైతులకు సూచించారు. పొలం పరిసరాల విశ్లేషణ చేసి నాణ్యమైన దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల నుంచి తెలుసుకోవాలన్నారు. చింతలపూడి వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ మాట్లాడుతూ పొలంబడిలో పండించిన పంటకు నాణ్యత ప్రమాణాలు పరీక్ష చేయిస్తే వారికి ఇండిగాప్ సర్టిఫికేషన్ వస్తుందని, దీనివలన పంటలను ఎఫ్‌పీవో ద్వారా అధికధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. బీజేపీ జిల్లా ప్రెసిడెంట్ ఏ.ప్రసాదు, ఎంపీటీసీ ఎ.బాలాజీ, రైతులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

కొయ్యలగూడెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకాన్ని బుధవారం అమలు చేశారు. కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి అందజేశారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ చింతల వెంకటరమణ, జ్యేష్ఠ రామకృష్ణ, గోలిశెట్టి శ్రీనివాస్ ప్రిన్సిపాల్ కుమార్, రామదాసు వెంకటరమణ పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు


గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రావణ మాస పూర్వ ఫల్గుని నక్షత్ర సందర్భముగా గోదాదేవికి తిరునక్షత్ర వేడుకలు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గోదా అమ్మవారికి పంచామృత అభిషేకము, తదనంతరము విశేష అష్టోత్తర శత నామ అర్చన, విశేషప్రసాద నివేదన, తిరునక్షత్ర తనియన్ విన్నపము, మొదలగు కార్యక్రమములు అర్చకులు వైభవంగా జరిపారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులందరికి తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం వికాస తరంగిణి సభ్యులు, శ్రీరామమూర్తి, సుగుణ దంపతులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

శ్రీనివాసపురంలో గ్రామసభ

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభ సర్పంచ్ యడ్లపల్లి రాధిక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీవో శ్రీదేవి ఉపాధి హామీ పథకంలో కల్పిస్తున్న పనులను వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


జంగారెడ్డిగూడెం రూరల్: పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించిన దృశ్యం

బుట్టాయగూడెం: తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీఓ ఈ. తులసి అన్నారు. మండలంలోని కోటరామచంద్రపురంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపే ఆ శిశువుకు తల్లి ముర్రిపాలు పట్టించడం వల్ల బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణులు, బాలింతల విషయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యవతి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాలు ఇచ్చే తల్లులు పాల్గొన్నారు.

కామవరపుకోట: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. తడికలపూడి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.వీరకుమారి గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించడం వలన పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కాయకూరలతో పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాధిక, అంగన్‌వాడీ వర్కర్ దేవమాత, వి.పద్మ, తులసికుమారి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో 7వ రోజు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.లక్ష్మి, ఎం.విజయలక్ష్మి బాలింతలు, గర్భిణులకు ముర్రిపాలు ఆవశ్యకతను తెలియజేశారు. డాక్టర్ రాంబాబు, శ్రీనివాసరావు, కౌన్సిలర్ మోహన్, ఏఎన్ఎం మణి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: బిడ్డకు తల్లిపాలు అమృత సమానమని, రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు అన్నారు. పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు కె.విమల, జి. నాగేశ్వరమ్మ, హెల్పర్లు టి.స్పందన, ఏఎన్ఎం సుజాత, సచివాలయం సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: తల్లిపాలతో శిశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.మాధవి తెలిపారు. మండలంలోని ఎల్ఎన్‌డీపేట, పట్టిసీమ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి కేంద్ర పరిధిలోని తల్లులకు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.వెంకటలక్ష్మి, కె.గంగాదేవి, ఎస్.సీత, ఎంపీహెచ్ఎస్ పి.ప్రసన్న, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీఓ యూఎన్ స్వర్ణకుమారి మాట్లాడుతూ వారం రోజులపాటు మండల వ్యాప్తంగా ఉన్న 69 అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని ఇందుకు సహకరించిన సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కొయ్యలగూడెం, పొంగుటూరు, బయ్యన్నగూడెం సెక్టార్ల పరిధిలో తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించారు.